క్లుప్తంగా

నేడు లక్ష పుష్పార్చన

పీలేరు రూరల్ : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న పీలేరు ఆరవ్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల నుంచి జరిగే లక్ష పుష్పార్చన కార్యక్రమానికి, ఆర్యవైశ్యులు, వాసవి సంఘాల సభ్యులు పాల్గొనాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకారం



ప్రజల నుంచి వినతిపత్రాలు అందుకుంటున్న ఓఎస్‌డీ మధుసూధన్

తంబళ్లపల్లె : నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓఎస్‌డి మధుసూధన్ తెలిపారు. స్వగ్రామం కోటకొండ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యారు.గ్రామ ప్రజలు స్వాగతం పలికారు. స్వామి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు అందుకున్నారు. సమస్యల పరిష్కారంతో పాటు సొంత నియోజకవర్గం స్వగ్రామంలో అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

కళాశాలకు టేబుళ్లు వితరణ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురంలోని పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆ కళాశాల పూర్వ విద్యార్థి మురళిమోహన్ రూ.1.5లక్షలు విలువ చేసే కుర్చీలు, టేబుళ్లు వితరణ చేశారు. ఆ కళాశాలలో 1990-92 విద్యాసంవత్సరంలో విద్యనభ్యసించిన ఆయన ప్రస్తుతం కెనరా బ్యాంక్ ఏజీఎంగా ఉద్యోగం చేస్తున్నారు. కెనరా బ్యాంక్ ద్వారా సీఎస్ఆర్‌లో భాగంగా కళాశాలకు మౌలిక వసతుల ఏర్పాటు చేస్తున్నట్లు దాత పేర్కొన్నారు. భవిష్యత్తులో కళాశాలకు అవసరమైన సదుపాయాలకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమం

బి.కొత్తకోట: విద్యతోనే భవిష్యత్తు ఉందని, విద్యను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని స్థానిక సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, నగర పంచాయతీ కమీషనర్ జీవీ.పల్లవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక విద్యార్థి కాన్సెప్ట్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుక కార్యక్రమం జరిగింది. దీనికి అతిథులుగా హాజరైన వీరు విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను పూర్తి చేసుకున్న వారి ఉపాధికి దేశంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యను కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చేస్తుందన్నారు. కాబట్టి విద్యను ఇష్టంగా అభ్యసించి ఉన్నతస్థానాలకు చేరుకుని పుట్టిన ప్రాంతానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన వేడుకలు స్థానికుల్లో హుషారు కలిగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించిన కార్యక్రమానికి స్థానికులు పెద్దంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థుల ఆట పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా, కరెస్పాండెంట్ రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కళలు



పగటి వేషధారణతో శ్రీనివాసులు బృందం

మదనపల్లె సిటీ : నాడు కళాకారులకు ఎంతో ఆదరణ ఉండేది. కళలను నమ్ముకుని అదే జీవనవృత్తిగా సాగిస్తున్న కళాకారులు నేడు మనుగడ కోల్పోతున్నారు. అయితే కళనే నమ్ముకున్న వారు ఇప్పటికీ దానిని విడవకుండా కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు పార్వతినగర్‌కు చెందిన కళాకారులు మదనపల్లె పరిసర ప్రాంతాల్లో వీధినాటకాలు ప్రదర్శిస్తున్నారు. సీతారామంజనేయయుద్ధం, శివపార్వతులు వంటి పగటి వేషాల ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రజలు ఇచ్చే అరకొర డబ్బులు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి పగటి వేషాలు వేస్తున్నామని, మా కుటుంబంలో మాతోనే ఈ కళ ఆగిపోతుందని కళాకారుడు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా శోభయాత్ర

కేవీపల్లె : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గర్నిమిట్టలో శ్రీరామ శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం నుంచి నూతనంగా నిర్మిస్తున్న శివాలయం వరకు సమరత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. కేవీపల్లె, బలిజపల్లెలో శోభాయాత్ర నిర్వహించారు.



రామసముద్రం : ఆర్.నడిపల్లిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు



కలకడ : షేర్‌ఖాన్ వంకవడ్డిపల్లెలో కల్యాణోత్సవంలో శ్రీ సీతారాముల వారు



పీలేరు రూరల్ : శ్రీ కల్యాణ సీతారామస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణం



కురబలకోట : మొలకవారిపల్లెలో ప్రత్యేక అలంకరణలో..

జగదభిరాముడి కల్యాణం.. జగమంతా ఆనందం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భారీగా పాల్గొన్న భక్తజనం
- మార్మోగిన రామనామ స్మరణ

జగదభిరాముడి కల్యాణానికి జగమే పరవశించింది. సర్వ మంగళ స్వరూపుడు శ్రీరాముడు, సకల జన శుభ ధాత్రి సీతాదేవి మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన వేళ.. భక్తజనం ఆనందంతో పులకించింది. ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. రామనామ స్మరణ మార్మోగింది.

మదనపల్లె సిటీ : కోటి జన్మల పుణ్యఫలం.. సీతారాముల కల్యాణం అని వేదపండితులు వర్ణించారు. ఆదివారం మదనపల్లె మండలం, రూరల్ పరిధిలోని గ్రామాల్లో శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో నవమి పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక అమినేనివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. వేదపండితులు శేఖర్‌స్వామి అభిజిత్ లగ్నంలో కళ్యాణం జరిపించారు. వెండిముత్యాల హారంను కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. డ్యాకుమెంట్ రైటర్ రంగు గుణ రూ.16 వేలకు ముత్యాల హారం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భవానీప్రసాద్, సాయిశేఖర్ రెడ్డి, రెడ్డప్పయాదవ్, దేవేంద్ర, దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి వివిధ రకాల పండ్లతో అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ సభ్యులు కళ్యాణంకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. స్థానిక అప్పారావువీధిలోని ఘటికాచల ఆంజనేయస్వామి ఆలయం, మేదరవీధిలోని పిండాల ఆంజనేయస్వామి ఆలయం, నీరుగట్టువారిపల్లె పాతూరులోని రామాలయం, చిత్తూరురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం, బసినికొండ వద్దనున్న కోదండరామస్వామి ఆలయాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, పటేల్‌రోడ్డు, ప్రశాంత్‌నగర్, బెంగుళూరు రోడ్డు, చౌడేశ్వరిసర్కిల్, నిమ్మనపల్లె క్రాస్, చిత్తూరు బస్టాండు ప్రాంతాల్లో పానకం.వడపప్పు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.





మదనపల్లె సిటీ : అమినేనివీధిలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న మహిళలు

ఉత్సవాల్లో పాల్గొన్న నిస్సార్‌అహ్మద్ : శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పలు రామాలయాలను సందర్శించారు. వరాల ఆంజనేయస్వామిఆలయం, సొసైటీకాలనీ రామాలయం, చిప్పిలి, ఎస్‌బిఐకాలనీ, బయ్యారెడ్డికాలనీలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, కొత్తపల్లి మహేష్,రేవతి, మల్లిక, మేరి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకుని పలు ఆలయాలను సందర్శించారు.

పీలేరు రూరల్ : శ్రీరామ నవమిని పురష్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం పీలేరు పట్టణం సదుం మార్గంలోని శ్రీ కల్యాణ సీతారామ స్వామి వారి దేవస్థానం, స్థానిక ప్రకాశం రోడ్డు రామాలయం తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య నిర్వహించిన సీతారాముల కల్యాణం కనువిందు చేసింది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భక్తలకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో టీఎస్ కుటుంబీకులు టీఎస్ విజయనారాయణరెడ్డి సహకారంతో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో వేదపండితులు స్కందమూర్తిశర్మ శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. కళ్యాణాలు కమనీనంగా జరిగాయి.

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలోని కొత్తపేట, బలిజగడ్డ వీధుల్లో ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. గుర్రంకొండలోని రామాలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బి.కొత్తకోట: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం మండలంలోని వాడవాడలా వైభవంగా జరిగాయి. బి.కొత్తకోట నగర పంచాయతీలో భక్తులు వీధివీధినా శ్రీరాముని చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు పానకాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయాలను మామిడితోరణాలు, ముస్తాబువేయగా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల విగ్రహాలతో ఉత్సవాలు జరిపారు. పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై వెలసిన సీతా రాములు, లక్ష్మణ, హనుమ విగ్రహాలకు పూజలు జరిపారు.

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే రామసముద్రం, జంగాలపల్లి, చెంబకూరు, వై.కురప్పల్లి , కెసి.పల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కలకడ : మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను శుద్ధిచేసి, రామాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గంగాపురం పంచాయతీ షేర్‌ఖాన్‌వంక వడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీసీతారాముల వారికి కళ్యాణోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు.

కురబలకోట: ధర్మ నిరతికి ఆదర్శ ప్రాయుడుగా నిలచిన శ్రీరాముడి కళ్యాణం మండలంలోని పోరెడ్డివారిపల్లె, కమతంపల్లె, మొలకవారిపల్లెతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

కలికిరి : పట్టణ పరిధిలోని గుండం వద్ద రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శ్రీసీతారాముల కళ్యాణోత్సవం, క్రాస్ రోడ్డులోని రామాలయంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. కలికిరి పంచాయతీ నగ్రావాండ్లపల్లిలో జరిగిన రామనవమి వేడుకలకు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోశ్చరణలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేని దుశ్శాలువాతో సన్మానించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి నాయకులు రమేష్‌కుమార్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, ఆలయ నిర్వాహకులు అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతి వడ్డిపల్లిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి ఇదే గ్రామానికి చెందిన గజ్జెల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ ప్రతిమలను ఉదారంగా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. సదరు ప్రతిమలకు వేద పండితులు సుందర పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మద్దయ్యగారిపల్లిలోని బంగ్లా వద్ద వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహానికి స్థానికంగా ఉండే కొత్తకోట హరిప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పీలేరు : పట్టణంలో హిందువులు భారీ బైక్ ర్యాలీ (శోభయాత్ర) నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్ఎస్ఎస్ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు

పెద్దమండ్యం : మండలంలోని ప్రతి పల్లెలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. పెద్దమండ్యం, వెలిగల్లు, బండమీదపల్లె, బిక్కావాండ్లపల్లె, బండకాడపల్లెల్లో సీతా రామలక్ష్మణుల ఉత్సవ విగ్రాహాలను ఊరేగించారు.



మదనపల్లె సిటీ : వివిధ రకాల పండ్లతో వరాల ఆంజనేయస్వామి అలంకరణ



మదనపల్లె సిటీ : బయ్యారెడ్డికాలనీలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్



కలికిరి: నగ్రావాండ్లపల్లి రామాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పెద్దతిప్పసముద్రం: ఉత్సవ మూర్తులను తీసుకెళుతున్న దాత కుటుంబ సభ్యులు



పీలేరు : శోభయాత్ర కార్యక్రమంలో భక్తులు



గుర్రంకొండ : సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కేవీపల్లె : శ్రీరామ శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బి.కొత్తకోట : ప్రసాదాలు అందిస్తున్న భక్తులు

బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్
- ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె : బీజేపీ పాలనలోనే భారతదేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని అన్నమయ్యజిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. భారతీయ జనతాపార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిలోకేష్, నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరామనవమి రోజున బీజేపీ ఆవిర్భావ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై బీజేపీ జెండాను ఎగురవేసి సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి, బర్నేపల్లె రవికుమార్, పిల్లస్వామినాయక్, సీనియర్ నాయకులు కృష్ణయ్యవర్మ, పూలనాగరాజు, భువనేశ్వరిసత్య, ఆనంద్, రాజశేఖర్‌రెడ్డి, భగవాన్, కోసూరిభవాని, మండల అధ్యక్షులు నాగరాజు, కిరణ్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో ఆదివారం బిజెపి పార్టీ నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. స్వీట్లు పంచిపెట్టారు. భారతదేశం అభివృద్ధికి బిజెపి పార్టీ అహర్నిశలు కృషి చేస్తున్నట్లు పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మగ్గాల లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె : బీజేపీ జెండా ఆవిష్కరించిన జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్, నాయకులు

కురబలకోట: మండలంలోని అంగళ్లులో బిజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, కేంద్ర నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆకుల కష్ణమూర్తి, ముత్రవారిపల్లె మాధవ రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కలకడ : దేశ హితమే బిజెపి లక్ష్యం అని బిజెపి పీలేరు అసెంబ్లీ కన్వీనర్ పాత్తూరి శ్రీకాంత్‌నాయుడు అన్నారు. స్థానిక బిజెపి మండలశాఖ అధ్వర్యంలో కలకడ మూడురోడ్లు కూడలిలో ఆపార్టీ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకుని పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ మండలశాఖ అధ్యక్షులు ముల్లగూరి.ఆంజినేయులు, నాయకులు శ్రీనివాసులురెడ్డి, శేఖర్, శ్రీదర్, మల్లికార్జున, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : గుర్రంకొండలో బీజేపీ ఆవిర్భావ దినోత్సాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానికబస్టాండులో బీజేపీ స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అక్కడే ఏర్పాటు చేసిన భరత మాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అందరికి స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా మండలబిజేపీ అధ్యక్షులు రామాంజులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 46 సంవత్సరాలు అవుతోందన్నారు. ఈకార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు రామాంజులు, నాయకులు శ్రీనివాసులు, రామ్మూర్తి, గౌరీహోటల్‌శీనా, మల్లయ్యస్వామి, మల్లీ, అమర, గునసేఖర రామాంజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం, కురబలకోట : పీటీఎం, కురబలకోట మండలాల్లో ఆదివారం బీజేపీ అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి పలువురికి స్వీట్లు పంచి పెట్టారు. బీజేపీ జాతీయ, రాష్ట, జిల్లా, మండల నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సాయి లోకేష్, క్రిష్ణమూర్తి, మాధవరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, కొత్తకోట శ్రీకాంత్, మల్లెం శివయ్య, కార్యం శంకర్, భాస్కరరెడ్డి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



కురబలకోటలో..



పెద్దతిప్పసముద్రంలో..



గుర్రంకొండలో..



కలకడలో..

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించడం జరుగుతుందని కాలేజీ ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు కాలేజీలో చేరి పాఠ్యాంశ బోధన వినాలన్నారు. బ్రిడ్జి కోర్స్ ఇంగ్లీషు, తెలుగు, మ్యాథ్స్, ఫిజిక్స్, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్ వంటి సబ్జెక్టులో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఏప్రిల్ 7 నుంచి 23వతేదీ వరకు బోధన చేయబడుతుందన్నారు. ఈ ఏడాది కొత్తగా ఎంబైపీసి కోర్సు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కాలేజీలో ఎంపిసి,బైపీసీ,సీఈసీ,హెచ్‌ఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులు అకౌంట్ అండ్ ట్యాక్స్‌షేషన్,నర్సింగ్, సెరికల్చర్, గార్మెంట్ టెక్నాలజీ, టైలరింగ్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కాలేజీలో చేరాలని కోరారు.

వాల్మీకిపురం పీవీసీ జూనియర్ కళాశాలలో..

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పీవీసీ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి 2025-26 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ అడ్మిషన్‌లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ డా. ఉమామహేశ్వరి తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులతో పాటు వృత్తి విద్యాకోర్సులైన ఎంఅండ్‌టీ, ఎంఎల్‌టీ, సెరికల్చర్ గ్రూపులున్నాయని, అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, సైన్సు, ఒకేషనల్ విద్యార్థులకు రికార్డులు, ప్రయోగ రికార్డులు ఉచితంగా అందించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది నుంచి ఈఏపీసెట్, నీట్ తరగతులు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.